సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం । 18 । జనవరి । 2024



ఎల్ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి ఎల్ఎండీకి నీటివిడుదల కొనసాగుతోంది. ఎల్ఎండీకి 500, కుడికాల్వ ద్వారా 300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



రాజన్న సేవలో కోదండరాం

వేములవాడఅర్బన్: రాజన్నను ప్రొఫెసర్ కోదండరాం బుధవారం దర్శించుకున్నారు. అర్చకులు స్వామివారి ప్రసాదం అందించారు. ఏఈవో శ్రీనివాస్, అల్లి శంకర్ పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
32.0/18.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

యువత సన్మార్గంలో పయనించాలి



మాట్లాడుతున్న డీఐఈవో మోహన్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా సన్మార్గంలో పయనించాలని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి చింతల మోహన్ కోరారు. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరంలో భాగంగా 5వ రోజు బుధవారం వలంటీర్లు గ్రామంలోని వీధులను శుభ్రం చేశారు. విద్యార్థులు చేస్తున్న సామాజిక కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవలో పాల్గొనడం అభినందనీయమన్నారు. సర్పంచ్ ముక్క శంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వాసరవేణి పర్శరాములు, అధ్యాపకులు విష్ణుప్రసాద్, సాగర్, వాలంటీర్లు పాల్గొన్నారు.

నేడు వాహనాలకు వేలం



మాట్లాడుతున్న చంద్రశేఖర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాలకు గురువారం బహిరంగవేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. ఈవేలంలో నాలుగు బైక్‌లు, రెండు ఆటోలకు బహిరంగవేలం వేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలో ధరావత్తుగా 50 శాతం ముందుగానే చెల్లించే వేలంలో పాల్గొనాలని సూచించారు. గురువారం ఉదయం 10 గంటలకు సర్కిల్ ఆఫీస్‌లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అర్హులకు డబుల్ ఇళ్లు కేటాయించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేటలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులకు కేటాయించాలని, లేకుంటే ఆందోళనలు చేస్తామని తెలంగాణ బహుజన బీడీకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్దిరాములు, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు పేర్కొన్నారు. ఈమేరకు తహసీల్దార్ భూపతికి వినతిపత్రం అందించారు. మాజీ జెడ్పీటీసీ ఎం.నర్సాగౌడ్, సోని, సయ్యద్ పారహాన్, భాగ్యలక్ష్మి, రేణ, గౌస్యా, ఎల్లవ్వ, సౌందర్య, ప్రవీణ్, శ్రీనివాస్, నజీర్, మహేవ సాహితీ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో ప్రవేశాలు

సిరిసిల్లకల్చరల్: రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో రానున్న విద్యాసంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా సమన్వయ అధికారి బి.జాక్వెలిన్ తెలిపారు. ప్రవేశపరీక్ష ద్వారా ఎంపిక చేస్తామన్నారు. ఈనెల 20లోపు tgcet.cgg.gov.in వెబ్‌సైట్‌లో రూ.100 ఫీజు, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు రూ.200 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్షను ఫిబ్రవరి 24న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మైనారిటీ విద్యాసంస్థల్లో ప్రవేశాలు

సిరిసిల్లకల్చరల్: జిల్లాలోని పలు మైనారిటీ విద్యాసంస్థల్లో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి బి.గంగయ్య ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, డెయిరీ టెక్నాలజీ వంటి వృత్తి విద్యాకోర్సుల్లో ఫస్టియర్‌లో ప్రవేశాలు పొందగోరే వారు ఆన్‌లైన్‌లో తమ వివరాలు పొందుపరచాలని సూచించారు. www.temreis.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఉన్న దరఖాస్తులను ఫిబ్రవరి 6లోపు పూర్తి చేయాలని తెలిపారు. వివరాలకు 73311 17865లో సంప్రదించాలని సూచించారు.

టెక్స్‌టైల్ పార్కు ఏడీకి వినతి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): జిల్లా పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం టెక్స్‌టైల్ పార్కు ఏడీకి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ యజమానులు ప్రభుత్వ ఆర్డర్ ఉన్నంత వరకే యూనిట్లను నడుపుతూ కార్మికులకు పని కల్పిస్తున్నారని, ఆ తర్వాత మాంద్యం పేరుతో బంద్ చేస్తున్నారని ఆరోపించారు. పార్కులో కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించేలా ప్రభుత్వ ఆర్డర్లు కేటాయించాలని కోరారు. అధ్యక్షుడు కోడం రమణ, ప్రధాన కార్యదర్శి మూషం రమేశ్, టెక్స్‌టైల్ పార్కు కార్మిక నాయకుడు కూచన శంకర్, గుంటుకు నరేందర్, యెల్లండి రమేశ్ పాల్గొన్నారు.

అమ్మినా.. కొన్నా.. జరిమానే

- ప్లాస్టిక్ భూతంపై బల్దియా సమరం
- రోజురోజుకు పెరుగుతున్న వినియోగం
- ప్రజల్లో లోపించిన చైతన్యం
- ప్రతిరోజు 12 టన్నుల ప్లాస్టిక్ వేస్టేజ్ ఉత్పత్తి
- ఎనిమిదేళ్లుగా ప్లాస్టిక్‌పై యుద్ధం
- అయినా నీరుగారుతోన్న లక్ష్యం



డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన ప్లాస్టిక్ చెత్త

సిరిసిల్ల మార్కెట్ ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యాపారులు నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తున్నారని తెలిసిన బల్దియా అధికారులు గతేడాది ఏకకాలంలో దాడులు చేశారు. నాలుగు నెలల పాటు షాపులను సీజ్ చేశారు. నిషేధిత వస్తువులు విక్రయించకుండా అగ్రిమెంటు రాసివ్వడంతో మళ్లీ దుకాణాలు తెరుచుకున్నాయి. ఇద్దరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారు.

ఆరు నెలల క్రితం మటన్ మార్కెట్‌లో ఎనిమిది మంది వ్యాపారులు కస్టమర్లకు ప్లాస్టిక్ కవర్లలో మాంసాన్ని పెడుతూ.. విక్రయిస్తున్నారు. స్థానికుల సమాచారంతో బల్దియా అధికారులు ఆ ఎనిమిది మంది వ్యాపారులకు తలో రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు.

సిరిసిల్లటౌన్: స్మార్ట్ సిరిసిల్లలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు బల్దియా ప్రత్యేక దృష్టితో ముందుకెళ్తోంది. అయితే అధికారులు ఆరంభ శూరత్వంతో కొన్ని రోజులు పకడ్బందీగా తనిఖీలు చేపట్టి.. తర్వాత పట్టించుకోవడం లేదు. దీంతో ప్లాస్టిక్ కవర్ల వినియోగం మళ్లీ యథాస్థితికి చేరుతుంది. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ అయాజ్ పట్టణంలో మళ్లీ నిషేధిత ప్లాస్టిక్‌పై యుద్ధం ప్రకటించారు. ఇకపై ఎవరూ.. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను అమ్మరాదు.. కొనరాదు.. వినియోగించరాదన్న నినాదంతో ముందుకెళ్తున్నారు. స్మార్ట్ సిరిసిల్లకు వన్నె తెచ్చేలా చేపట్టిన యుద్ధంపై ప్రత్యేక కథనం.

ఎనిమిదేళ్లుగా సమరం..పూర్తిగాని లక్ష్యం

రాష్ట్రంలోనే ప్రథమంగా సిరిసిల్ల మున్సిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్నారు. 2015లో అప్పటి మున్సిపల్ కమిషనర్ ఇంటింటా తడి, పొడి చెత్తను వేరు చేయడం ఆరంభించగా.. అది రాష్ట్రవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచింది. ఈక్రమంలోనే మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ దిశానిర్దేశంలో ప్లాస్టిక్ నిషేధ పట్టణంగా మున్సిపల్ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. మార్కెట్‌లో తక్కువ మందం గల క్యారిబ్యాగ్స్, సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ గ్లాసులు తదితరాలను నిషేధించారు. ప్లాస్టిక్ వ్యాపారులకు అవగాహన కల్పిస్తూ 50 మైక్రాన్స్ కన్నా తక్కువగా ఉన్న ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిషేధించారు. ఇన్నాళ్లుగా మున్సిపల్ స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తుంది. పట్టణంలో సేకరించిన ప్లాస్టిక్ వేస్టేజ్‌ను రీసైక్లింగ్ చేసే కంపెనీలకు అమ్ముతూ ఆదాయం గడిస్తుంది బల్దియా. రీసైక్లింగ్ చేసిన ప్లాస్టిక్ పదార్థంతో తయారుచేసిన షీట్లతో అంబేద్కర్ చౌరస్తా, శివనగర్ పార్కు, రైతుబజార్ ప్రాంతాల్లో 53 ఫుట్‌పాత్ దుకాణాలు ఏర్పాటు చేసింది.

నిషేధిత పదహారు ప్లాస్టిక్ వస్తువులు

సెంట్రల్ పొల్యుషన్ కంట్రోల్‌బోర్డు(సీపీసీబీ) వినియోగంలో ఉంటున్న పదహారు రకాల ప్లాస్టిక్ వస్తువులపై సిరిసిల్ల బల్దియా సంపూర్ణ నిషేధాన్ని ప్రకటించింది. 2022 జూలై 1 నుంచి నిషేధాజ్ఞలు అమల్లోకి తెచ్చినట్లు వెల్లడించారు. ఇయర్‌బర్డ్స్, బుడగలు(బెలూన్స్), క్యాండి, ఐస్‌క్రీం కోసం వాడే పుల్లలు, ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, ప్లాస్టిక్ కత్తులు, ట్రేలు, ప్లాస్టిక్ స్వీట్ బాక్సులు, ఆహ్వాన పత్రికలు, సిగరెట్ ప్యాకెట్లు, 100 మైక్రాన్ల లోపు ఉండే పీవీసీ బ్యానర్లు, పాలిస్టరిన్(థర్మాకోల్) 100 మైక్రాన్ల కన్నా తక్కువ ఉండే ప్లాస్టిక్ కవర్లను నిషేధం అమలవుతుంది.

'లక్ష'ణంగా పెనాల్టీలు

గత ఏడాదిగా మున్సిపల్ అధికారులు దాడులు చేసి 67 మంది వ్యాపారులు, నిషేధిత ప్లాస్టిక్ వినియోగదారులపై కేసులు నమోదు చేశారు. పట్టణంలోని 39 వార్డుల నుంచి మున్సిపల్ సిబ్బంది తడి, పొడి, ప్లాస్టిక్ వ్యర్థాలను వేర్వేరుగా సేకరిస్తున్నారు. డంపింగ్‌యార్డులో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా ఐటీసీ కంపెనీ ఆధ్వర్యంలో స్వశక్తి సంఘంతో డీఆర్‌సీసీ సెంటర్(డ్రై రీసోర్స్ కలెక్షన్ సెంటర్) నిర్వహిస్తున్నారు. పట్టణంలోని అన్ని వార్డుల ద్వారా కేవలం ప్లాస్టిక్ వ్యర్థాలే రోజుకు 12 టన్నులకు పైగా ఉంటోంది. నెలలో 360 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను డీఆర్‌సీసీ సెంటర్ నిర్వాహకులు సేకరించి, రీసైక్లింగ్ చేసే కంపెనీలకు విక్రయిస్తున్నారు.

అవగాహన లోపం.. అసలు రోగం

- పట్టణంలోని అన్ని వార్డుల్లో చెత్తసేకరణకు వందలాది సంఖ్యలో డస్ట్‌బిన్స్ ఏర్పాటు చేశారు. బిన్లలో చెత్త వేయకుండా డ్రెయినేజీల్లో వేస్తుండడంతో మురుగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతుంది.
- వర్షాకాలంలో, పట్టణ ప్రగతిలో భాగంగా మున్సిపల్ అధికారులు ప్రత్యేక డ్రైవ్స్ చేపట్టారు. తర్వాత అధికారుల పర్యవేక్షణ లేక ప్లాస్టిక్ అమ్మకాలు, వినియోగం పెరిగింది.
- ప్లాస్టిక్ వ్యర్థాలతో మోరీల్లో సిల్టు ఎప్పటికప్పుడు నిండి దుర్గంధం వ్యాపించడమే కాకుండా దోమలు వ్యాప్తికి కారణమైతుంది.



చర్యలు తీసుకుంటాం



సిరిసిల్లలో నిషేధాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నాం. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు పేర్కొన్న ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించాం. వ్యాపారులు, ఫంక్షన్‌హాల్స్ యజమానులకు ప్రత్యేకాదేశాలు జారీ చేశాం. ఆదేశాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు. సిరిసిల్ల స్వచ్ఛతను కాపాడేందుకు పౌరులు సహకరించాలి. సేకరించిన ప్లాస్టిక్ చెత్తను రీసైక్లింగ్ చేసే కంపెనీలకు మాత్రమే అందిస్తున్నాం.

– ఎండీ అయాజ్, మున్సిపల్ కమిషనర్

చెట్ల కింద చదువులు.. పట్టించుకోని సార్లు

- సిరిసిల్ల కాలేజీలో అన్నీ ఇబ్బందులే..
- కనిపించని మూత్రశాలలు, మరుగుదొడ్లు
- ఎవరికీ చెప్పుకోలేని బాలికలు
- 53 ఏళ్ల కాలేజీలో అష్టకష్టాలు
- ఈవీఎంలకు, ఆఫీస్‌లకు కాలేజీ భవనాలు
- అరకొర వసతులతో అవస్థలు

ఇది జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ దుస్థితి. చెట్ల కింద కూర్చుని చదువుకుంటున్న ఈ విద్యార్థినిలు మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్(ఎంపీహెచ్‌డబ్ల్యూ) కోర్సు చదువుతున్నారు. వీరంతా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులు. ఆర్థికంగా ఉన్న వాళ్లు ప్రైవేటు కార్పొరేట్ కాలేజీల్లో చేరి చదువుతుండగా.. నిజమైన పేదలు ప్రభుత్వ కాలేజీల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. కాలేజీలో తరగతిగదులు లేక పేద పిల్లలు ఇలా చెట్ల కింద చదువుతున్నారు.





ఇది సిరిసిల్ల కాలేజీలోని ఓ తరగతి గది. ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు కలిపి పాఠాలు బోధిస్తున్నారు. కాలేజీలో కొత్తగా నిర్మించిన భవనంలో 2018 ఎన్నికల నాటి ఈవీఎంలను భద్రపరిచారు. 2023లో ఎన్నికలు ముగిసినా.. ఆ ఈవీఎంలను అలాగే భద్రపరచడంతో ఆ భవనం మొత్తంగా పోలీస్ సెక్యూరిటీకి, ఈవీఎంలకు కేటాయించారు. ఫలితంగా సిరిసిల్ల కాలేజీలో చదివే విద్యార్థులకు తరగతిగదులు లేక ఇలా కంబైన్డ్ క్లాసులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఆఫీస్(డీఐఈవో)ను కాలేజీలోనే ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ నిర్మించక ముందు వివిధ ప్రాంతాల్లో ఆఫీస్‌లను ఏర్పాటు చేశారు. కానీ డీఐఈవో ఆఫీస్‌కు కలెక్టరేట్‌లో చాంబర్ కేటాయిస్తే ఈ ఆఫీస్‌ను అక్కడికి మార్చే అవకాశం ఉంది. కానీ జిల్లా అధికారులు ఆ దిశగా చొరవ చూపకపోవడంతో ఇలా మరో కొత్త భవనంలో డీఐఈవో ఆఫీస్ కొనసాగుతోంది. ఫలితంగా విద్యార్థులకు తరగతి గదుల కొరత తప్పడం లేదు.

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను 1970లో ప్రారంభించారు. 53 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ కాలేజీలో ఎందరో ప్రముఖులు చదువుకుని ఉన్నత స్థితిలో స్థిరపడ్డారు. ప్రస్తుతం ఈ కాలేజీలో 581 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో బాలురు 421, బాలికలు 160 మంది ఉన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులతోపాటు వృత్తివిద్య కోర్సులైన ఏఅండ్‌టీ, ఏఈటీ, సీటీ, ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ అందుబాటులో ఉన్నాయి. 24 మంది అధ్యాపకులు, ఇతర సిబ్బంది ఉన్నారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా గదులు లేక కంబైన్డ్ క్లాసులు తీసుకుంటున్నారు. చెట్ల కింద చదువులు సాగిస్తున్నారు. హైస్కూల్ స్థాయిలోనే అన్ని వసతులు కల్పిస్తుండగా సిరిసిల్ల కాలేజీలో ఇలా చెట్ల కింద చదువులు ప్రభుత్వ విద్యావ్యవస్థలో ఉన్న అవస్థలకు అద్దం పడుతుంది.

ఐదేళ్లుగా ఆధునిక భవనాలు పరాధీనం

2018 ఎన్నికల ఫలితాలపై కోర్టు వివాదం ఉండడంతో ఈవీఎంలను ఇక్కడి కొత్త భవనంలోని స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచారు. 24 గంటల సాయుధ పోలీసు రక్షణలో ఆ భవనం ఉంది. వాస్తవానికి 2023 ఎన్నికలు కూడా ముగియడంతో ఆనాటి కోర్టు కేసుకు పెద్దగా విలువ కూడా ఉండదు. జిల్లా అధికారులు ఎన్నికల సంఘం అనుమతి తీసుకుని ఆ ఈవీఎంలను మరో చోటికి తరలించే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదు. డీఐఈవో ఆఫీస్‌ను కలెక్టరేట్ సముదాయంలోకి మార్చే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదు. రెండు కొత్త భవనాలు ఇలా పరాధీనం కావడంతో విద్యార్థులకు తరగతి గదుల కొరత ఏర్పడింది. కాలేజీకి ఓ స్వచ్ఛంద సంస్థ 40 కంప్యూటర్లను ఇచ్చేందుకు ముందుకు రాగా.. స్థలం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

మూత్రశాలలు, మరుగుదొడ్లు కరువు

కాలేజీలో బాలురకు మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. బాలికలకు ఒకే ఒక్క మరుగుదొడ్డి ఉండగా.. బాలికల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. బాలురు ఒంటికి, రెంటికి ఇబ్బందులు పడుతూ బయటకు వెళ్లాల్సి వస్తుంది. ఎన్నికల సందర్భంగా రెవెన్యూ అధికారులు ఇటీవల తరగతి గదుల గోడలను కూల్చారు. బ్లాక్ బోర్డులు తొలగించారు. గోడలను తిరిగి నిర్మించినా బ్లాక్‌బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో పాఠాలు బోధించలేని పరిస్థితి.

కలెక్టర్ చొరవ చూపితేనే పరిష్కారం

సిరిసిల్ల కళాశాలలోని సమస్యలపై కలెక్టర్ అనురాగ్ జయంతి చొరవ చూపితేనే పరిష్కారం లభిస్తుంది. డీఐఈవో ఆఫీస్ తరలింపు, ఈవీఎంల తరలింపునకు అనుమతి తీసుకోవడం, మరుగుదొడ్ల నిర్మాణాలు, బ్లాక్‌బోర్డుల ఏర్పాటు వంటి వాటిని పరిశీలిస్తే.. కాలేజీ విద్యార్థులకు కాస్తయినా మెరుగైన వసతులు దరిచేరుతాయి. కలెక్టర్ ఈమేరకు క్షేత్రస్థాయి పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది.



ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్స్

పలుమార్లు నివేదికలు అందించాం



సిరిసిల్ల ప్రభుత్వ కళాశాలలోని సమస్యలపై పలు మార్లు ఉన్నతాధికారులకు, కలెక్టర్‌కు నివేదించాం. విద్యార్థులను ఆరు బయట కూర్చోబెట్టాల్సి వస్తుంది. వర్షాకాలంలో చాలా ఇబ్బందులు ఉన్నాయి. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– కనక విజయరఘునందన్, కళాశాల ప్రిన్సిపాల్, సిరిసిల్ల

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి

- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కోదండరామ్‌ను సన్మానిస్తున్న పలు సంఘాల నాయకులు

వేములవాడఅర్బన్/కోనరావుపేట(వేములవాడ): ప్రజలను కలుపుకుపోయి అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడలోని మహాలింగేశ్వర ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నిర్వహించిన పౌర సన్మానానికి హాజరై మాట్లాడారు. వేములవాడ ఆలయాన్ని గొప్ప క్షేత్రంగా తీర్చిదిద్దుతామన్నారు. వేములవాడ అభివృద్ధిపై మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని త్వరలోనే కలుస్తానన్నారు. తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం మాట్లాడుతూ పౌర సమాజం నిర్వహిస్తున్న సన్మానం మన సన్మానం మనం చేసుకున్నట్లుగా ఉందన్నారు. నేరెళ్ల తిరుమలగౌడ్, బుస్స దశరథం, పంజాల వెంకటేశ్వర్, ప్రకాశం, సత్యనారాయణ, కనకయ్య, రమేశ్, అమర్, పోశెట్టి, రవీందర్, బింగి మహేశ్ పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యంపై దృష్టి

ప్రజా ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం వట్టిమల్లలో పల్లె దవాఖానాను జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ఆస్పత్రులలో అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు అందుతాయన్నారు. ఆరోగ్యశ్రీ వైద్యసేవల పరిమితిని రూ.10లక్షలకు పెంచిందన్నారు. ఎంపీపీ చంద్రయ్యగౌడ్, సర్పంచ్ కొమ్ము స్వప్న, ఉపసర్పంచ్ వుంగంగౌడ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గండి నరేశ్, వైద్యాధికారి వేణుమాధవ్, సర్పంచుల ఫోరమ్ కన్వీనర్ గోపు పర్శయ్య, సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, సీహెచ్‌వో బాలచందర్, డీపీవో ఉమాదేవి, సూపర్‌వైజర్ ఉమాదేవి, ఏఎన్ఎంలు తిరుమల, జ్యోతి పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలోని పెండింగ్ రెవెన్యూ సమస్యలు సోమవారం నాటికి పరిష్కరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్లతో మాట్లాడారు. ధరణి, ఇతర భూమి సమస్యలపై వచ్చిన అర్జీలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. హైకోర్టు, ఇతర న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల పరిష్కారంపై శ్రద్ధ పెట్టాలన్నారు. కోర్టు ఆర్డర్ ప్రకారం టైమ్‌లైన్‌లో అర్జీలు పరిష్కరించాలన్నారు. మీసేవ సర్వీసెస్ పెండింగ్‌పై సమీక్షించారు.

సీఎమ్మార్ లక్ష్యం సాధించాలి

15 రోజుల్లోగా సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) లక్ష్యాన్ని పూర్తి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. తహసీల్దార్లు అన్ని రైస్‌మిల్స్ నడిచేలా చూడాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల నమోదు, సవరణలపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో డబుల్ పేర్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్, ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగయ్య, డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్అండ్ఆర్ కాలనీల్లో సదస్సులు

నాబార్డ్ సంస్థ చేపట్టే జీవన ఉపాధులు, అభివృద్ధి, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను మధ్యమానేరు పునరావాస కాలనీల్లో చేపట్టాలని కలెక్టర్ కోరారు. కలెక్టరేట్‌లో నాబార్డు, గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులతో సమీక్షించారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రంగాల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. శిక్షణ పొందిన వారు రూరల్ మార్ట్ పేరుతో యూనిట్లు పెట్టుకుంటే నాబార్డ్ ద్వారా రూ.5లక్షల వరకు ఆర్థిక సహాయం అందజేస్తుందని తెలిపారు. నాబార్డ్ జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ మనోహర్ రెడ్డి, డీఆర్‌డీవో నక్క శ్రీనివాస్, అదనపు డీఆర్‌డీవో మదన్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైలకు స్థానచలనం

- పోలీసుశాఖలో బదిలీలు
- విధుల్లో చేరిన సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి



సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి



శ్రీకాంత్ బోయినపల్లి ఎస్సై



కె.ప్రశాంత్‌రెడ్డి తంగళ్లపల్లి ఎస్సై



జె.రమేశ్ వీర్నపల్లి ఎస్సై



అశోక్ రుద్రంగి ఎస్సై



వి.వెంకటేశ్వర్లు చందుర్తి ఎస్సై

సిరిసిల్లక్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో స్థానికత, సుదీర్ఘ కాలం పనిచేసిన అంశాలను పరిగణనలోకి తీసుకొని బదిలీలు జరిగాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో బదిలీలు ఉంటాయని అధికారులు ఊహించారు. దానికి అనుగుణంగా మొదట రాష్ట్రంలో పోలీసుల బదిలీలు జరిగిన విషయం విదితమే. ఇదే విధానంలో జిల్లాలోని పోలీసుల బదిలీలు ఉంటాయని అందరూ భావించారు. కానీ బదిలీల ఊసే ఎత్తలేదు. ఇటీవల సిరిసిల్ల టౌన్ సీఐ, సీఆర్‌బీ సీఐ స్థానచలనం, బోయినపల్లి, రుద్రంగి ఎస్సైలను ఏఆర్‌కు అటాచ్ చేయడంతో ఇక బదిలీలు అనివార్యమని జిల్లాలో చర్చ సాగింది. ఇంతలోనే తంగళ్లపల్లి ఎస్సై మామూళ్లు వసూలు చేశారని సోషల్‌మీడియాలో వాయిస్‌లు వైరల్ కావడంతో పోలీస్ బాస్ స్పందించారు. ఆ వాయిస్‌పై విచారించినట్లు తెలిసింది. చిన్నాచితక విషయాల్లో ఎస్‌హెచ్‌వోలపై విమర్శలున్న నేపథ్యంలో ఎస్పీ అఖిల్ మహాజన్ పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

విధుల్లో చేరిన సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి

ఎన్నికల ముందుకు సిరిసిల్ల టౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఉపేందర్‌ను బదిలీ చేస్తూ డీఆర్‌బీలో సీఐగా విధులు నిర్వహిస్తున్న రఘుపతికి సిరిసిల్ల టౌన్ సీఐగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈమేరకు బుధవారం సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా రఘుపతి విధుల్లో చేరారు.

ఎస్సైల బదిలీలు

జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ బుధవారం ఉత్తర్వులు వెల్లడించారు. స్పెషల్ బ్రాంచ్ ఎస్సై ఎల్.శ్రీకాంత్‌ను బోయినపల్లికి, అక్కడ విధులు నిర్వర్తిస్తున్న మహేందర్‌ను జోన్ 3కి బదిలీ చేశారు. స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న కె.ప్రశాంత్‌రెడ్డిని తంగళ్లపల్లికి నియమించగా ఇక్కడ విధుల నిర్వర్తిస్తున్న వెంకటేశ్వర్లును చందుర్తి ఎస్సైగా బదిలీ చేశారు. వేములవాడ టౌన్ ఠాణాలో పనిచేస్తున్న జె.రమేశ్‌ను వీర్నపల్లికి, ఇక్కడ విధులు నిర్వహిస్తున్న నవతను స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. ఇన్నాళ్లు చందుర్తి ఎస్సైగా పనిచేసిన అశోక్‌ను పక్కనే ఉన్న రుద్రంగికి బదిలీ చేశారు. సిద్దిపేట కమిషనరేట్ నుంచి బి.రాంమోహన్‌ను గంభీరావుపేటలో నియమించారు. రుద్రంగి ఎస్సైగా పనిచేస్తున్న రాజేశ్‌ను జోన్ 3కి సరెండర్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా

వచ్చే నెల 11న రాష్ట్రస్థాయి కరాటే పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్లో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలను ఫిబ్రవరి 11న నిర్వహించనున్నట్లు విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి, అకాడమీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కె.వసంత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం అల్ఫోర్స్ పాఠశాలలో సంబంధిత పోస్టర్ ఆవిష్కరించారు. కటాస్, స్పారింగ్, టీమ్ కటా విభాగాల్లో పోటీలు జరుగుతాయని, విజేతలకు బంగారు, రజత, కాంస్య పతకాలను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇన్‌స్ట్రక్టర్లు పుల్లూరి శ్రీనివాస్, బి.ప్రవీణ్ గౌడ్, తిరుపతి, రాజశేఖర్ రెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

21 నుంచి ఖోఖో జట్టుకు శిక్షణ శిబిరం

కరీంనగర్ స్పోర్ట్స్: ఈ నెల 21 నుంచి కోరుట్ల మండలంలోని అయిలాపూర్‌లో సీనియర్స్ పురుషుల ఖోఖో జట్టుకు శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు ఖోఖో సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నటరాజు రవి, వై.మహేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులను శిక్షణకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. శిబిరం నిర్వాహకుడు మంగ సంతోష్‌కు ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు రిపోర్టు చేయాలన్నారు. ఇక్కడ ప్రతిభ కనబరిచే క్రీడాకారులను ఫిబ్రవరి 6 నుంచి 8వ తేదీ వరకు నల్గొండ జిల్లా భువనగిరిలో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ ఖోఖో పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు..

నరేశ్, శశికుమార్, కిశోర్, ఉదయ్‌కుమార్, గణేశ్, నవీన్ రాజు, శ్రీరామ్, పి.వెంకటేశ్, రాహుల్, ఎల్.రాకేశ్, టి.శ్రీనాథ్, ఎ.విజయ్, కె.శ్రీపాల్, వి.గణేశ్, బి.రాజు, ఎల్.మహేందర్, వి.పవన్, సీహెచ్.అఖిల్, ఎం.రాహుల్, ఆర్.అరవింద్, జి.తిరుమలేశ్, ఆర్.అజయ్.

చీకోడు ఎల్లమ్మ ఆలయంలో చోరీ



ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని చీకోడు గ్రామంలో మంగళవారం రాత్రి దొంగలు పడ్డారు. ఎల్లమ్మ ఆలయ తలుపులు బద్దలు కొట్టి హుండీని ఎత్తుకెళ్లారు. గీత కార్మికులకు ఇది వార్నింగ్ మాత్రమే అంటూ బొగ్గుతో రాయడంపై కార్మికులు ఆందోళన చెందుతున్నారు. రూ.40వేల విలువైన కల్లు కుండలను ధ్వంసం చేశారు. గ్రామంలోని ఒక కిరాణ దుకాణం, హోటల్ తలుపులను బద్దలుకొట్టి, వస్తువులను చిందరవందర చేశారు. దుకాణంలోని రూ.20 వేల విలువైన సామగ్రి చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. నాలుగు గొర్రెలను ఎత్తుకెళ్లారని కాపరులు పేర్కొన్నారు. గ్రామ శివారులో ఆరబెట్టిన 50 కిలోల మిరపకాయలను దొంగతనం చేశారని బాధితుడు చిన్ని రవీందర్‌రెడ్డి తెలిపారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధ్యులను శిక్షించాలని గీత కార్మికులు గున్నాల గణేశ్‌గౌడ్, చంద్రాగౌడ్, నాగరాజుగౌడ్ కోరారు.

గంజాయి విక్రేత అరెస్టు

రాయికల్(జగిత్యాల): గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు రాయికల్ ఎస్సై అజయ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ మండలానికి చెందిన ఆత్రం సోనేరావు గతంలో భూపతిపూర్‌కి చెందిన వ్యక్తులకు గంజాయి విక్రయించాడు. బుధవారం మళ్లీ అమ్మేందుకు రాయికల్ పట్టణంలోని భరతమాత విగ్రహం వద్దకు వచ్చాడు. పోలీసులు అరెస్ట్ చేశారు.

పుట్టగొడుగులకు డిమాండ్

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం
- పెంచేందుకు ముందుకువస్తున్న రైతులు
- ప్రాజెక్టులో భాగంగా పెంచుతున్న పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు



పుట్టగొడుగులతో వ్యవసాయ కళాశాల విద్యార్థులు



పాలిథిన్ కవర్లలో పుట్టగొడుగుల పెంపకం

జగిత్యాల అగ్రికల్చర్: ఇటీవల పుట్టగొడుగులకు మార్కెట్లో డిమాండ్ పెరిగింది. చాలామంది ఔత్సాహిక రైతులు పెంచేందుకు ముందుకు వస్తున్నారు. పొలాస వ్యవసాయ కళాశాల ఫైనలియర్ విద్యార్థులు సైతం తమ ప్రాజెక్టులో భాగంగా పుట్టగొడుగులు పెంచుతున్నారు. కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్లాగౌడ్ గైడ్‌గా వ్యవహరిస్తున్నారు.

చాలా రకాలున్నాయి..

పుట్టగొడుగుల్లో చాలా రకాలు ఉన్నాయి. అయినా, వాటిలో తినేందుకు వరి గడ్డి, బటన్, అయిస్టర్, పాల పుట్టగొడుగులు మాత్రమే అనువైనవి. వీటిలో అనేక రకాల పోషకాలున్నాయి. ఆయా ప్రాంతాల వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన వివిధ రకాల పుట్టగొడుగులు అందుబాటులో ఉండటంతో సాగుకు ఎంతోమంది ఆసక్తి చూపుతున్నారు. పుట్టగొడుగులను తక్కువ వ్యవధిలో, వ్యవసాయ వ్యర్థ పదార్థాలైన వరిగడ్డి, చొప్ప, ఇతర పదార్థాలతో తక్కువ ఖర్చుతో పెంచి, మంచి ఆదాయం పొందవచ్చు.

ఎలా పెంచుతారంటే..

పుట్టగొడుగులను పెంచేందుకు 6–12 నెలల వయసున్న గడ్డిని ముక్కలు ముక్కలు చేయాలి. తర్వాత దానిపై నీళ్లు చల్లి, తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి. ఒక కేజీ వరి గడ్డికి 50 గ్రాముల స్పాన్ కలిపి, పాలిథిన్ సంచుల్లో నింపి, రబ్బర్ బ్యాండ్ వేయాలి. ఈ సంచులను తగినంత తేమ, ఉష్ణోగ్రత ఉన్న గదుల్లోకి తీసుకెళ్లాలి. 3–4 వారాలకు గడ్డిపై తెల్లని శిలీంధ్రం వస్తుంది. ఇలా చేసిన 6–7 రోజులకు తొలి పంట వస్తుంది. రంగు మారిన, మచ్చలు కలిగిన గడ్డిని ఉపయోగించవద్దు. పుట్టగొడుగులు పెంచే గదుల్లోకి పురుగులు, కీటకాలు, ఎలుకలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గదిలో ఉష్ణోగ్రత, తేమ శాతం తటస్థంగా ఉండాలి.

లాభాలివే..

పుట్టగొడుగులను 30–40 రోజుల్లో పెంచవచ్చు. వీటిల్లో ప్రొటీన్స్ వరి, గోధుమ, కూరగాయలతో పోల్చితే అధికంగా ఉంటాయి. తాజా పుట్టగొడుగుల్లో విటమిన్–డి ఎక్కువగా ఉంటుంది. పొటాషియం, సోడియం నిష్పత్తి, పీచు పదార్థాలు అధికంగా ఉండటం వల్ల బీపీ, ఎసిడిటీ బాధపడే వారికి చాలా ఉపయోగపడుతాయి. విటమిన్–బి, విటమిన్–సి, ఫాంటాథెనిక్, నియాసిన్లు అధికంగా ఉంటాయి.

శాఖాహారులకు మాంసాహారంగా..

పుట్టగొడుగులపై ప్రజలకు అవగాహన పెరగడం వల్ల మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ప్రొటీన్ ఎక్కువగా ఉండటంతో శాఖాహారులకు మాంసాహారంగా ఉపయోగపడుతాయి. గ్రామీణ నిరుద్యోగ యువత, మహిళలు, సన్నకారు రైతులు పుట్టగొడుగుల పెంపకాన్ని చేపట్టితే అధిక దిగుబడి, ఆదాయం పొందవచ్చు. పుట్టగొడుగుల ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి, ఇతర దేశాలకు ఎగుమతి చేయవచ్చు. పచ్చళ్లు, బిర్యానీ, సూప్ పౌడర్, కెచప్ వంటివి తయారు చేయవచ్చు.

15 రోజుల వ్యవధిలో 3 పంటలు



ఎప్పుడూ తేమ ఉండేలా చూస్తే పుట్టగొడుగులు పెరిగి, 15 రోజుల వ్యవధిలోనే 3 పంటలు వస్తాయి. ప్రతీ కిలో ఎండుగడ్డి నుంచి దాదాపు కిలో పచ్చి పుట్టగొడుగులు వస్తాయి. రైతులకు లాభసాటిగా ఉంటుంది.

– వినితా రెడ్డి, వ్యవసాయ విద్యార్థిని

తాజాగా ఉంటే మంచి ధర



పుట్టగొడుగులు తాజాగా ఉన్నప్పు విక్రయిస్తే మంచి ధర వస్తుంది. ఫ్రిజ్‌లో అయితే మరో 3 రోజులు నిల్వ ఉంటాయి. ఏడాదికి 9 పంటలు తీయవచ్చు. పుట్టగొడుగుల్లో నలుపు, ఆకుపచ్చ, పసుపుపచ్చవి వస్తే తీసివేయాలి.

– మనోజ్ కుమార్, వ్యవసాయ విద్యార్థి

రైతులకు శిక్షణ ఇస్తాం



పుట్టగొడుగులు పెంచాలనుకునే రైతులు బృందాలుగా వస్తే వ్యవసాయ కళాశాలలో శిక్షణ ఇస్తాం. విద్యార్థులు తమ ప్రాజెక్టులో తయారు చేసి, సక్సెస్ అయ్యారు. పుట్టగొడుగులను పెంచడం తేలిక, తక్కువ ఖర్చు.

– డాక్టర్ ఎల్లాగౌడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పొలాస

దాడి ఘటనలో 8 మందిపై కేసు

ముత్తారం(మంథని): దంపతులపై దాడి ఘటనలో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుసూదన్‌రావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఈ నెల 16న ముత్తారం మండలంలోని లక్కారంలో దొరి మంజుల–శ్రీనివాస్ దంపతులపై అదే గ్రామానికి చెందిన వీరగోని శ్రీనాథ్, రాజేశం, విజయ్, శేఖర్, శివ, భాగ్యమ్మ, గొట్టిముక్కల సౌజన్య, రాజమణి దాడి చేశారు. బాధితురాలు మంజుల బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని చామనపల్లికి చెందిన ఆవారి బక్కమ్మ(80) చికిత్స పొందుతూ మృతిచెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. బక్కమ్మ గత శనివారం తన ఇంటి ముందున్న రాళ్లను తొలగిస్తుండగా నాగుపాము కాటు వేసింది. కుటుంబసభ్యులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి చనిపోయింది.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న మల్లేశం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని చెర్లభూత్కూర్‌కు చెందిన గీత కార్మికుడు మడ్డి మల్లేశం తాటిచెట్టు పైనుంచి పడి, తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. మల్లేశం మంగళవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కుతుండగా మోకు జారడంతో కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతని ఛాతి, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు వెన్నెముక విరిగినట్లు నిర్ధారించారు. వారి సూచనల మేరకు అదేరోజు రాత్రి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

మృత్యువుతో పోరాడి ఓడిన యువకుడు

- రూ.3లక్షలు ఖర్చు చేసినా దక్కని ప్రాణం
- గుండెలో ఇన్‌ఫెక్షన్‌తో మృతి
- నారాయణపూర్‌లో విషాదం
- రోడ్డున పడ్డ కుటుంబం



అనుప రాజు(ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గుండె దగ్గర ఇన్‌ఫెక్షన్‌తో ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చేరి మూడు రోజుల పాటు మృత్యువుతో పోరాడిన యువకుడు చివరికి ప్రాణాలు వదిలాడు. దాతలు స్పందించి సాయం అందించి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చినప్పటికీ మృత్యువును గెలువలేకపోయాడు. కుటుంబ పెద్ద మృతితో అతనిపై ఆధారపడ్డ భార్య, ఇద్దరు పిల్లలు రోడ్డున పడ్డారు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో బుధవారం విషాదం నింపింది. నారాయణపూర్‌కు చెందిన అనుప రాజు(25) ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న రాజును కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చూపించగా, గుండె వద్ద ఇన్‌ఫెక్షన్ సోకినట్లు వైద్యులు గుర్తించారు. వెంటనే వైద్యం చేయించకుంటే ప్రాణాలకు ప్రమాదం ఉందని తెలపడంతో ఓ ప్రైవేట్ అస్పత్రిలో చేర్పించారు. చేతిలో చిల్లి గవ్వ లేకపోవడంతో రాజు ప్రాణాలు దక్కించుకునేందుకు కుటుంబ సభ్యులు తెలిసిన వ్యక్తుల వద్ద అప్పులు చేసి పెట్టారు. దాదాపు రూ.3లక్షల వరకు వెచ్చించారు. కుటుంబ పరిస్థితి అంతంతే కావడంతో అప్పటికే గ్రామస్తులు తమకు తోచిన విధంగా ఆర్థిక సహాయం అందించారు. అయినా ఇన్‌ఫెక్షన్ తీవ్రత పెరిగి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. రెండు రోజుల్లో రూ.3 లక్షలు ఖర్చుచేసిన ప్రాణాలు దక్కకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతునికి తండ్రి మల్లయ్య, భార్య శిరీష, మూడేళ్ల కూతురు మనుశ్రీ, నాలుగు నెలల కుమారుడు మన్విత్ ఉ న్నారు. కడుపేదరికం అనుభవిస్తున్న రాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోడు రైతులపై కేసులు ఎత్తివేయాలి

- ప్రజాసంఘాల ప్రతినిధి మల్లారపు ప్రశాంత్



మాట్లాడుతున్న ప్రశాంత్

సిరిసిల్లటౌన్: పోడు భూముల పోరాటంలో పాల్గొన్న రైతులు, ప్రజాసంఘాల నాయకులపై కేసులు ఎత్తివేయాలని ప్రజాసంఘాల ప్రతినిధి మల్లారపు ప్రశాంత్ కోరారు. కోర్టులో కేసు నిమిత్తం బుధవారం ప్రజాసంఘాల ప్రతినిధులు హాజరు కాగా జిల్లా కేంద్రంలోని బీవైనగర్‌లోని సీఐటీయూ ఆఫీసులో ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. పోడుభూముల హక్కుపత్రాలను రైతులకు ఇవ్వాలని పోరాడితే అక్రమ కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పించడం ఏందని ప్రశ్నించారు. యాభై ఏళ్లుగా పోడు వ్యవసాయం చేసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుపేదలకు హక్కుపత్రాలను అందించాలని కోరారు. నాయకులు ఈసంపల్లి కొమురయ్య, జింక పోచయ్య, జూలపల్లి మనోజ్, గజ్జెల ప్రశాంత్, గుర్రపు నరేశ్, రమేశ్‌చంద్ర పాల్గొన్నారు.



ఇంటింటా జైశ్రీరామ్



అయోధ్యలోని రామాలయంలో ఈనెల 22న ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరగనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే అక్షింతల శోభాయాత్రలు కొనసాగుతుండగా తాజాగా ఇంటింటా జై శ్రీరామ్ నినాదాలతో విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌తోపాటు అనుబంధ సంస్థలు ఈ క్రతువులో భాగస్వామ్యం అవుతున్నాయి. పట్టణంలోని వాణిజ్య సముదాయానికి జై శ్రీరామ్ నినాదాలు రాశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల

నేడు అభిషేకం టికెట్లు రద్దు

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న ఆలయంలో గురువారం రేవతి నక్షత్రం సందర్భంగా స్వామివారికి ఉదయం 9 గంటలకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా రాజన్న దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నందున అభిషేకం టికెట్లు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీని బట్టి అన్నపూజ టికెట్లు మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

వ్యాపారి ఆత్మహత్యాయత్నం

వేములవాడఅర్బన్: వ్యాపారంలో భాగస్వామ్యం ఇస్తానని నమ్మించి డబ్బులు తీసుకొని మోసం చేశాడని సిరిసిల్లకు చెందిన పట్టాభి వెంకటేశం శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడు వెంకటేశం తెలిపిన వివరాలు. వేములవాడకు చెందిన వ్యాపారి, సిరిసిల్లకు చెందిన పట్టాభి వెంకటేశం వద్ద కోటి రూపాయలు అప్పుగా తీసుకున్నాడు. ఇందుకు తన వ్యాపారంలో భాగస్వామ్యం ఇస్తానని నమ్మించాడు. భాగస్వామ్యం ఇవ్వకపోగా చెల్లని చెక్కులు ఇవ్వడంతో మోసం చేశాడని బాధిత కుటుంబం వేములవాడలోని సదరు వ్యాపారి సినిమా థియేటర్ వద్దకు చేరుకున్నారు. వ్యాపారంలో భాగస్వామ్యం ఇస్తానని నమ్మించి మోసం చేశాడంటూ ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే సదరు వ్యాపారి పూర్తి డబ్బులు చెల్లిస్తానని హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు. ఈ విషయమై వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

జిల్లా డోర్స్ అధ్యక్షుడిగా కొండల్‌రావు



కలెక్టర్ అనురాగ్‌జయంతిని కలిసిన డోర్స్ కార్యవర్గం

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా అధికారుల అసోసియేషన్(డోర్స్) అధ్యక్షుడిగా వై.కొండల్‌రావు(డీటీవో) బుధవారం ఎన్నికయ్యారు. డోర్స్ ఫౌండర్ చైర్మన్‌గా అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ వ్యవహరిస్తున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎ.వినోద్‌కుమార్(ఎస్సీ కార్పొరేషన్ ఈడీ), సంయుక్త కార్యదర్శిగా బి.గంగయ్య(స్పెషల్ డిప్యూటీ కలెక్టర్), కోశాధికారిగా పీబీ శ్రీనివాసాచారి(సీపీవో), ప్రచార కార్యదర్శిగా మామిండ్ల దశరథం(డీపీఆర్వో), కార్యవర్గ సభ్యులుగా లక్ష్మీరాజం(డీడబ్ల్యూవో), నక్క శ్రీనివాస్(డీఆర్‌డీవో), మదన్‌మోహన్(అదనపు డీఆర్‌డీవో) ఎన్నికయ్యారు. జిల్లా అధికారుల సంఘం నూతన కార్యవర్గం కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఎన్.ఖీమ్యానాయక్‌లను కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని కలెక్టర్ అభినందించారు.

యాసంగి సాగుకు మల్లన్నసాగర్ నీరు

- మంత్రి ఉత్తమ్‌ను కలిసిన కాంగ్రెస్ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి



కేకే మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): సిరిసిల్ల వరప్రదాయని ఎగువమానేరు ప్రాజెక్టు ఆయకట్టు రైతుల యాసంగి సాగుకు నీరు విడుదల చేయాలని భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి విన్నవించినట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మ హేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు మంత్రి ఈఎన్సీ హరిరామ్‌కు ఆదేశాలు జారీ చేశారని తెలి పారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో బుధవా రం కలిసినట్లు చెప్పారు. ఎగువ మానేరు ప్రస్తుత పరిస్థితి, యాసంగి సాగుకు రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించినట్లు తెలిపారు. గంభీరావుపేట, ఎ ల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాల రైతులు యాసంగికి పూర్తి స్థాయిలో వరినాట్లు వేశారనే విషయాన్ని మంత్రికి వివరించినట్లు చెప్పారు. మంత్రి స్పందించి నీటి విడుదలకు ఆదేశాలు జారీ చేశారన్నారు. కూడవెళ్లి వాగు పరివాహక గ్రామాల రైతులతోపాటు ఎగువ మానేరు ప్రాజెక్టు కింద ఉన్న మూడు మండలాల్లోని ఆయకట్టు భూములకు సాగునీరు అందుతుందన్నారు. కూడవెళ్లి చెక్‌డ్యామ్‌లు నిండి పక్షం రోజుల్లో ప్రాజెక్టులోకి నీరు వస్తుందన్నారు. రైతులు ఆందోళన చెందొద్దని కోరారు.

వస్త్రపరిశ్రమలో సంక్షోభం కేటీఆర్ పుణ్యమే..

- సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: పాలిస్టర్ వస్త్రపరిశ్రమ సంక్షోభం మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పుణ్యమేనని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. గత పదేళ్లగా సిరిసిల్ల కాటన్, పాలిస్టర్ వస్త్రపరిశ్రమతోపాటు అనుబంధ రంగాలను ఏనాడు ఖాతర్ చేయలేదన్నారు. కేవలం బతుకమ్మ చీరలపైనే దృష్టి పెట్టి, తన అనుయాయులు పది మందికి కోట్లాది రూపాయలు వచ్చేలా చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు కేటీఆర్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలిస్టర్ వస్త్రోత్పత్తి కార్మికుల సంక్షేమ బాధ్యతలు యజమానులపై ఉందన్నారు. గత ప్రభుత్వంలా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం యజమానులు, కార్మికులు, ఆసాములు, అనుబంధ రంగాల అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. బతుకమ్మ చీరలకు టోకెన్లు ఇచ్చి వస్త్రం తీసుకున్న బీఆర్‌ఎస్ సర్కారు అప్పుడే బిల్లులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కేటీఆర్ పుణ్యంతోనే బతుకమ్మ చీరలకు సంబంధించిన రూ.260కోట్లు బకాయిలు పేరుకుపోయాయని, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తుందని స్పష్టం చేశారు. ఈనెలాఖరు నుంచి రెండు నెలల్లోపు విడతల వారీగా బిల్లులు అందజేస్తుందని హామీ ఇచ్చారు.

నేరాల నియంత్రణలో బ్లూకోల్ట్స్ కీలకం

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: ఆపదలో ఉన్న వాళ్లు ముందుగా డయల్ 100 సమాచారం ఇస్తారని దీనిపై వీలైనంత త్వరగా స్పందించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. నేరాల నియంత్రణలో కీలకపాత్ర వహించేది బ్లూకోల్ట్, పెట్రోకార్ సిబ్బంది అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం బ్లూకోల్ట్, పెట్రోకార్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. నేరాలు జరిగే ప్రదేశాలను గుర్తించి, నిఘా పెంచాలన్నారు. ప్రాపర్టీ సంబంధిత నేరాల నియంత్రణలో బ్లూకోల్ట్స్, పెట్రోకార్స్ పాత్ర కీలకమన్నారు. బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బంది, ప్రజలపై బాధ్యతగా మెలగాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అత్యవర సేవలైన రోడ్డు ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు, పట్టణాలు, గ్రామాల్లో జరిగే అవాంఛనీయ సంఘటనలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు మొదలైన వాటికి త్వరగా స్పందించాలని సూచించారు. ఏఎస్పీ చంద్రయ్య, వర్టికల్ డీఎస్పీ రవీందర్, సీఐలు కరుణాకర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే భద్రత

- ఎస్పీ అఖిల్ మహాజన్



వేములవాడఅర్బన్: ప్రజల భాగస్వామ్యంతోనే నేరాలను నియంత్రించగలమని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. వేములవాడలోని న్యూ అర్బన్ కాలనీలో బుధవారం నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో పాల్గొని మాట్లాడారు. సరైన పత్రాలు లేని 13 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను సీజ్ చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ, భద్రత పోలీస్ బాధ్యత అన్నారు. పల్లెల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. యువత చెడు అలవాట్లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రతి ఒక్కరు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కి కాల్‌చేయాలన్నారు. ట్రెయినీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు కరుణాకర్, కృష్ణకుమార్, కిరణ్‌కుమార్, ఎస్సైలు, పోలీసులు సిబ్బంది ఉన్నారు.

మాంద్యంతోనే మార్కెట్ బంద్

- బట్టనిల్వలు పేరుకున్నాయి
- త్వరలోనే బంద్ విరమణ
- పాలిస్టర్ వస్త్రోత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు సత్యం

సిరిసిల్లటౌన్: మార్కెట్లో సిరిసిల్ల పాలిస్టర్ వస్త్రానికి డిమాండ్ లేక నిల్వలు పేరుకుపోయినందునే తాత్కాలికంగా సాంచాలు బంద్ పాటిస్తున్నట్లు వస్త్రోత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మండల సత్యం పేర్కొన్నారు. సిరిసిల్లలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. గుడ్డకు మార్కెట్లో వస్తున్న ధర గిట్టుబాటు కావడం లేదన్నారు. బంద్ నేపథ్యంలో గుడ్డకు డిమాండ్ ఇప్పుడిప్పుడే పెరుగుతోందన్నారు. మరో రెండు రోజుల్లో ధర పెరిగే అవకాశం ఉందని, తాము చేపడుతన్న బంద్‌కు ఎవరి ప్రోద్బలం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తమకు ఆర్డర్లు ఇచ్చేందుకు సుముఖం వ్యక్తం చేసిందని తెలిపారు. కౌన్సిలర్ వెల్దండి దేవదాసు, బూట్ల నవీన్ తదితరులు ఉన్నారు.